క్లుప్తంగా

పోచమ్మ ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న దంపతులు

ముస్తాబాద్: మండలం గూడెంలో శ్రీపోచమ్మ ఆలయం పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేద స్వస్తి, నిత్యనిధి, వాస్తు హవన హోమం నిర్వహించారు. యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. దృష్టిస్థాపన, కుంభదర్శనం కార్యక్రమాలను నిర్వహించారు. చిలుముల సుగుణాచార్యుల చేతుల మీదుగా జరుగుతున్న ఉత్సవాల్లో హరీశ్, రుద్రమణి వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు, సర్పంచ్ చిట్నేని సరిత, ఎంపీటీసీ శ్రీధర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సెస్ మాజీ డైరెక్టర్లు విజయరామారావు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో లక్కమారికాపు సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాంమోహన్, సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్, నాయకులు పూడూరి ప్రవీణ్, వెంగళి తిరుపతి, రవినాయక్, పోకల సంతోష్, మ్యాదరి నారాయణ, దొంతరవేణి లక్ష్మీరాజం, బద్దెపూరి రవీందర్, కదిరె కిషన్, ఎర్ర లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన



లెమన్ గ్రాస్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. మండలంలోని ముస్తఫానగర్ గ్రామంలోని లెమన్ గ్రాస్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి, ఆయిల్ తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కోళ్లమద్ది గ్రామ శివారులోని పట్టు పరిశ్రమను సందర్శించారు. మల్బరీ తోట పెంపకం, పట్టు పురుగుల పెంపకం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, వృక్ష, జంతు శాస్త్ర విభాగం అధ్యాపకులు శ్రీవల్లి, బిక్షమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ భావాలు పెంపొందించుకోవాలి



జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీపీ శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: విద్యార్థి దశ నుంచి జాతీయ భావాలు పెంపొందించుకోవాలని సిరిసిల్ల జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిత్య జాతీయ పతాకావిష్కరణ 100వ రోజు వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి సిహెచ్. మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా కళాశాలలో నిత్య జాతీయపతాక ఆవిష్కరణ జరపడం అద్భుతమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, ప్రోగ్రామ్ అధికారి బుర్ర వెంకటేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల పూజలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, ముస్తాబాద్ హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయాల్లో గురువారం మండల పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం అనంతరం ధ్వజారోహణంతో పూజలు ప్రారంభించి, స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. గురుస్వాములు శ్రీనివాస్, రాజు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. డిసెంబర్ 26 వరకు ఈ మండల పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న మహాపడిపూజ ఉంటుందని తెలిపారు. ముస్తాబాద్‌లో నాగపూరి నర్సాగౌడ్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని గురుస్వామి రాజు ప్రారంభించారు.



ముస్తాబాద్‌లో ధ్వజారోహణం చేస్తున్న రాజుగురుస్వామి



ఎల్లారెడ్డిపేట: ధ్వజారోహణం చేస్తున్న స్వాములు

నియామకం

కాంగ్రెస్ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేశ్



గండికోట సురేశ్

సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ గ్రామానికి చెందిన గండికోట సురేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బలుమూరి వెంకట్ గురువారం నియామక పత్రం జారీ చేశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన గౌరవాన్ని కాపాడుకుంటానని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అందని విద్యుత్ సేవలు

- వినియోగదారులకు తప్పని తిప్పలు
- ధర్మారంలో పూర్తయిన సబ్‌స్టేషన్ పనులు
- రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోని వైనం

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యను నివారించేందుకు మంజూరు చేసిన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభోత్సవం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో రైతులకు విద్యుత్ సంబంధమైన సమస్యలు తప్పడంలేదు. కోనరావుపేట మండలం ధర్మారంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయి రెండేళ్లు అయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. సబ్‌స్టేషన్ ప్రారంభం కాకపోవడంతో మూడు గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కాలేదు.

పూర్తయిన సబ్‌స్టేషన్ పనులు

కోనరావుపేట మండలం ధర్మారంలో నిర్మించే 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎన్‌పీడీసీఎల్ నుంచి రూ.1.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను 2020 ఫిబ్రవరి 6న ఎమ్మెల్యే రమేశ్‌బాబు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు త్వరితగతిన పూర్తయ్యాయి. ఆపరేటర్ల గది, సబ్‌స్టేషన్ మిషనరీలు, రక్షణ వ్యవస్థ తదితర పనులు పూర్తయ్యాయి.

మూడు గ్రామాలకు ప్రయోజనం..

ధర్మారంలో సబ్‌స్టేషన్ పనులు పూర్తికావడంతో మల్కపేట, ధర్మారం, కనగర్తి గ్రామాలకు లబ్ధి చేకూరనుంది. ధర్మారం గ్రామంలో 820 గృహ కనెక్షన్లు, 750 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మల్కపేటలో 754 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కనగర్తి శివారులోని మూడు రైస్‌మిల్లులకు నిరంతర విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. సబ్‌స్టేషన్ ప్రారంభం అయితే వీరందరికీ ప్రయోజనం కలుగనుంది. ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్ ఆవరణ పూర్తిగా పిచిమొక్కలతో నిండిపోయింది. సబ్‌స్టేషన్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ధర్మారంలో ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్



ఆపరేటర్ గది ముందు పెరిగిన పిచ్చిమొక్కలు

రెండు ఫీడర్ల పనులు చేయాలి

ధర్మారంలో సబ్‌స్టేషన్ పనులు పూర్తయ్యాయి. సెస్ అధికారులు 11 కేవీ లైన్ ఇంకా వేయలేదు. అలాగే నాలుగు ఫీడర్లకు గాను, రెండు ఫీడర్ల పనులు మాత్రమే అయ్యాయి. సెస్ వాళ్లు ఇంకా రెండు ఫీడర్ల పనులు చేయాల్సింది. రిటైర్డ్ ఉద్యోగులను ఆపరేటర్లుగా నియమించేందుకు ప్రతిపాదనలు పంపించాం. ఆ పనులు పూర్తి కాగానే ప్రారంభిస్తాం.

– ప్రదీప్, ఏడీ, ఎన్‌పీడీసీఎల్

చిత్రకథ



గుంతలు తవ్వారు.. పూడ్చడం మరిచారు

తంగళ్లపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో నీటిని సరఫరా చేసే పైపులు లీకేజీ కారణంగా మరమ్మతుల కొరకు మిషన్ భగీరథ శాఖ అధికారులు తవ్వించారు. మరమ్మతుల అనంతరం గుంతలు పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఐఎఫ్‌బీతో సంబంధం లేదు

- మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం

గంభీరావుపేట: ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీతో తనకింక ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం అన్నారు. మండల కేంద్రంలోని తన స్వగృహంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్‌ను తాను ఉపసంహరించుకోవడానికి తన కుటుంబంలో జరిగిన విషాద సంఘటన కారణమని తెలిపారు. ఏఐఎఫ్‌బీలో టిక్కెట్లు అమ్ముకోవడం బాధించిందన్నారు. ఇకపై ఆ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో తాను ఏ పార్టీకి మద్దతునిస్తానో ప్రకటిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మేకల కమలాకర్, గోపగారి లక్ష్మీనారాయణ, గుడికాడి బాలయ్య, శంకరయ్య, మొగిలాల దేవరాజుగౌడ్, వేశాల వెంకటి, రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మృత్యుంజయం

సమస్యాత్మక గ్రామాలే లక్ష్యంగా కవాతు

వీర్నపల్లి: సమస్యాత్మక గ్రామాలే లక్ష్యంగా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని వీర్నపల్లి ఎస్సై నవత అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆధ్వర్యంలో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎక్కడ ఏ అవకతవకలు జరిగినా సీవిజిల్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఫిర్యాదు వచ్చిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, ఆస్తులను ధ్వంసం చేసినా, గొడవలు సృష్టించినా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని అన్నారు.



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై

ఓటు ప్రాధాన్యతపై కళాప్రదర్శన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఓటు ప్రాధాన్యతపై కళాకారులు కళాప్రదర్శన చేశారు. జిల్లా సాంస్కృతిక సారథి, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలన్నారు. ఓటు విలువ ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలని అన్నారు. వికలాంగులకు, వృద్ధులకు, గర్భిణులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయనున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, కళాకారులు పోత్తూరి రాజు బృందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

చందుర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు కేంద్రం ఎన్నికల సంఘం అందించిన ఓటరు స్లిప్‌లను ఇంటింటికీ గురువారం పంపిణీ చేపట్టారు. గ్రామాల్లోని బీఎల్‌వోలుకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎన్నికల విధి విధానాలపై వారికి అవగాహన కల్పించి, ఓటర్ల స్లిప్‌లతో పాటు ఓటరు గైడ్, సి-విజిల్ పాంప్లెట్లను అందజేశారు. బూత్ లెవల్ అధికారులకు అందించిన వాటిని నిర్ణీత గడువులోగా పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడంతో వాటి పంపిణీ కార్యక్రమంలో అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులు బిజీ అయ్యారు. ఓటరు స్లిప్‌లు ముట్టినట్లుగా ఇంటి పెద్ద నుంచి సంతకాలు సేకరిస్తున్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించాలి

- తొలిమెట్టు కార్యక్రమంపై కళాశాల విద్యార్థులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వేములవాడఅర్బన్: విద్యార్థులు తమ చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉత్తమ పౌరులుగా రాణించాలని కళాశాల ప్రిన్సిపాల్ వద్లూరి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమంపై కళాశాల విద్యార్థులకు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వలంటీర్లకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులకు రాయడం, చదవడం తదితర విషయాలపై పరిజ్ఞానం కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ఈ నెల 18 నుంచి వారికి కేటాయించిన పాఠశాలలో తమ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ అధికారి శ్రీనివాస్, రమాదేవి, వెంకటేశ్వర్లు, మధు రాజేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

ముస్తాబాద్: విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని కాంప్లెక్స్ మండల నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి కోరారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో తొలిమెట్టుపై రెండో రోజు గురువారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో గ్రంథాలయాల నిర్వహణ, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. విద్యార్థులలో దాగివున్న వ్యక్తిగత సామర్థ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాధా కిషన్‌రావు, రాజేశ్వరి, ఆర్‌పీలు శివశంకర్, శ్యామ్, శ్రీనివాస్, స్రవంతి, రాజేందర్ పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ రాష్ట్ర సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఈవో రమేశ్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ పద్మజ, జిల్లా సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి కొమ్మెర రాజుకుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈవో రమేశ్

విద్యార్థులకు అభినందన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14 వాలీబాల్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావడంపై డీఈవో రమేశ్ గురువారం హర్షం ఉన్నారు. అండర్-14 విభాగంలో ఉమ్మడి జట్టుకు ఎంపికైన నిషాంత్, మణితేజ, అంజన్న, సౌమ్యలను అభినందించారు. పీడీ రవికుమార్, ఉపాధ్యాయులను అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

కోనరావుపేట: మండలం కనగర్తిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగపెల్లి దేవరాజు, తిరుపతి, నిరంజన్, కరుణాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు



గర్భిణులకు కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి

కోనరావుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిట్లను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రషీద్, ఏఎన్ఎంలు సరోజన, సరోజ, సుష్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదాం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త దుంపెన రమేశ్ గురువారం మొక్కలు పంపిణీ చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఉసిరి మొక్కలను ఆటోలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరు నడుం బిగించాలని, పచ్చదనాన్ని కాపాడుకోవాలని కోరారు. ఉసిరి మొక్కలు అవసరం ఉన్న వారికి వాటిని అందజేస్తామన్నారు.



మొక్కలు అందజేస్తున్న రమేశ్